# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 10 జనవరి , 2026 | పేజీలు :08


## కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ సంక్షేమ బోర్డు ప్రకటించాలి



వివరాలు మెయిన్‌లో...

## సిపిఐ శత వార్షికోత్సవ పోస్టర్ విడుదల




**ప్రజాపక్షం/కరీంనగర్:**ఈనెల 18న ఖమ్మంలో జరుగు సిపిఐ జాతీయ శత జయంతి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి కోరారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద సిపిఐ శత జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జనవరి 18న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ప్రజలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. వందేళ్ల సిపిఐ సమర చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు సమకాలిన రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ప్రమాదం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు తదితర విషయాలను నేటి తరానికి తెలియజేసి భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు ఈ సభ దోహద పడుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు చీలిపోయి బలహీనడ పడడం వల్లనే దేశంలో మతోన్మాదులు పెరిగిపోయారని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోని రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నదని మోడీ ప్రభుత్వం నియంత్రత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నించాల్సిన విపక్షాలు మేధావులు,కవులు, కళాకారులపై కక్షగట్టి అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని అన్నారు. పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈ సభకు అన్ని రాష్ట్రాల నుంచి సిపిఐ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నగర కార్యవర్గ సభ్యులు కసి బోసుల సంతోష చారి గామినేని సత్యం, చెంచల మురళి, మాడిశెట్టి అరవింద్, భాకం అంజన్న, అల్లంకి రాజు, రామ్మూర్తి పాల్గొన్నారు.

## కొత్త గనులతోనే సింగరేణికి భవిష్యత్తు

### ఎఐటియుసి నాయకులు సీతారామయ్య, రాజ్ కుమార్ లు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :**సింగరేణి లో కొత్త గనులు రాకుంటే భవిష్యత్తు లేదని, కొత్త గనుల కోసం ఏఐటియుసి చేసే పోరాటాల్లో కార్మిక వర్గం కలిసి రావాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు పేర్కొన్నారు. గురువారం రాత్రి జరిగిన ఏఐటియుసి ఆర్జీ వన్ జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో ప్రస్తుతం ఉన్న గనులు ఇంకో నాలుగైదు సంవత్సరాల్లో మూత పడుతాయని దీని వల్ల ఇంకో ముప్పై ఏళ్ల పాటు సర్వీస్ ఉన్న కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందని వారు పేర్కొన్నారు. సింగరేణి కి కొత్త గనులు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి గుర్తింపు సంఘం ఏఐటియుసి వినతి పత్రం ఇచ్చి నెలలు గడిచినా ఇంత వరకు పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. , కేంద్ర ప్రభుత్వం 2015 లో ఎం.ఎం.డి.ఆర్ చట్టం ప్రవేశపెట్టిన సమయం లో కేంద్రానికి టిఆర్ఎస్ మద్దతు ఇవ్వడం వల్ల సింగరేణి కి గనులు రావడం లేదని వారు ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా బొగ్గు బ్లాక్ ల కోసం సింగరేణి కి దక్కె విధంగా టెండర్ వేసేందుకు అనుమతి ఇవ్వాలని, ప్రైవేటు సంస్థ లకు మరియు జెన్ కో సంస్థ లను టెండర్ వేయకుండా అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ లో ఉన్న సింగరేణి సంస్థ ను కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ను డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి.రావు,బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, ఎం.ఎ.గౌస్ తో పాటు ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ రికార్డులు అనధికారికంగా నమోదు చేసిన సీనియర్ అసిస్టెంట్ ఇంతియాజ్ అలీ సస్పెన్షన్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రెవెన్యూ రికార్డులను అనధికారికంగా నమోదు చేసినందుకు గాను ధర్మారం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటేషన్ పై సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఇంతియాజ్ అలీ సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ధర్మారం తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా డిప్యూటీషన్ పై పని చేస్తున్న ఇంతియాజ్ అలీ గతంలో పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ , రికార్డుల నిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో రెవెన్యూ పహాణిలో పేరు తప్పుగా అనధికారికంగా నమోదు చేశారని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కు ఇటీవల సంబంధిత పట్టాదారు అందించిన ఫిర్యాదు పై కలెక్టర్ స్పందించి పెద్దపల్లి తహసిల్దార్ ను నివేదిక ఇవ్వవలసిందిగా ఆదేశించారని, పెద్దపల్లి తహసిల్దార్ అందించిన నివేదిక ప్రకారం రికార్డులను అనధికారికంగా నమోదు చేసినట్లు తేలిందని తెలిపారు.అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ ఇంతియాజ్ అలీ ను సస్పెండ్ చేస్తున్నట్లు, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ దాటి వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కరీంనగర్‌కు ఆయుష్ మంజూరు

పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసిన కేంద్రం

రూ.15 కోట్లతో 50 పడకల ఆసుపత్రికి కేంద్రం ఆమోదం

రూ.7.5 కోట్ల నిధులు విడుదల

ఆయుష్ సేవల్లో ఉత్తర తెలంగాణకు కీలకం కానున్న కరీంనగర్

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ లో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ‘ఆయుష్’ ఆసుపత్రి ఏర్పాటు కోసం గత కొంత కాలంగా కృషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపి కేంద్రానికి పంపించారు. ఉన్నతాధికారులతోపాటు కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ను కలిసి కరీంనగర్ లో ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. తెలంగాణలో వికారాబాద్, సిద్దిపేట, భూపాపల్లి జిల్లాల్లో ఇప్పటికే ఆయుష్ ఆసుపత్రులు ఉన్నాయి. అయినప్పటికీ బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు కరీంనగర్ లో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కేంద్ర ఆయుష్ విభాగం అధికారులు పరిశీలించారు. ఉత్తర తెలంగాణలో ఆయుష్ సేవల పట్ల ప్రజలు మక్కువ చూపుతున్నట్లు తేలడంతో కరీంనగర్ లో ‘ఆయుష్’ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు మొత్తం రూ.15 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అందులో భాగంగా రూ.7.5 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. తక్షణమే ఆయుష్ ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని ఎంపిక చేసి ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. స్థల ఎంపిక ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుతోపాటు డాక్టర్లు, సిబ్బందిని నియామక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. కేంద్రం ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆయుష్ అధికారులతో చర్చించారు. స్థల సేకరణపై దృష్టి సారించారు.



## మరమ్మతులు పూర్తయ్యేదెన్నడు ?

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**మండలంలోని కామారెడ్డి రాజన్నసిరిసిల్లా ప్రధాన రహదారి పదిర బ్రిడ్జి అప్రోచ్ స్లాబ్ మరమ్మత్తులు నిర్మిస్తున్నామని సంబంధిత అధికారులు స్టాప్‌గేటును అడ్డుగా నిలిపారు.నిర్మాణపనులు జరుగుతున్నాయా అంటే అధీలేదు కాని ఎందుకు పనులు నిలిపివేశారో అర్థంకావడం లేదని వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.నత్తనడకన పనులు చేసి ఆదిలోనే పనులు నిలిచాయి,ఈ మార్గం నిత్యం వందలాదిగా వెళుతుంటాయి.కాని అధికారులు చోద్యం చూస్తున్నట్లుగా ఉన్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.దక్షిణకాశిగా ఉన్న వేములవాడకు వెళ్ళే దారి సిరిసిల్లారోడ్డు మహాశివరాత్రి సమీపిస్తుండటంతో పలు జిల్లాల నుండి అధికంగా బస్సులు తిరుగుతాయి. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.బ్రిడ్జికి అడ్డుగా బారికేడ్ పెట్టడంతో ఒక వాహనం వెళితే మరో వాహనం వెళ్ళలేని పరిస్థితి.కనీసం ద్విచక్రవాహనం కదిలేపరిస్థితి లేదని ఇలాంటి ఇక్కట్లు లేకుండా యుద్ధప్రాతిపదికన అధికారులు పనులు చేయించాలని తెలుపుతున్నారు.అంతేకాకుండా రాగట్లపల్లి వద్ద,హరిదాస్‌నగర్,వెంకటాపురం గ్రామాలవద్ద రోడ్లన్ని గుంతలమయంగా మారింది.ఆర్అండ్‌బీ అధికారులు మహాశివరాత్రి లోపు పనులు చేయాలని అధికార యంత్రాంగం స్పందించాలని పలువురు తీవ్రంగా మండిపడుతున్నారు.

## అభివృద్ధిపనులకు నుడా చైర్మన్ శంకుస్థాపన

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధిపనులకు నుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 28 డివిజన్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి అదే డివిజన్‌ఓ మరో రోడ్డుకు రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి, 52వ డివిజన్ విద్యాధరి స్కూల్ పక్కన రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి, 37వ డివిజన్ గాయత్రినగర్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలతో శుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్ పక్క రోడ్డు ఫార్మేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను, ఇబ్బందులను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఇంకా మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మాజీ కార్పోరేటర్లు అర్ష మల్లేశం, సరిల్ల ప్రసాద్, గంట కళ్యాణి శ్రీనివాస్, ముల్కల కవిత, దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కీర్తి కుమార్ తదితరులున్నారు.

## జాతరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు

**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలంలో రానున్న సమ్మక్క సారలమ్మ జాతర సంధర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టినట్లు వీణవంక మండల పోలీసు అధికారి ఆవుల తిరుపతి తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జాతరను భక్తిశ్రద్ధలతో చట్ట నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. చట్టాన్ని అతిక్రమించి ఏ విధమైన గొడవలు, హింసాత్మక చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు , సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారానికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే కేసులు నమోదు చేసి బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. జాతర జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, గస్తీ, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందిస్తేనే జాతరను సురక్షితంగా విజయవంతంగా నిర్వహించగలమని ఆయన అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:**సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణం లోని కమాన్ రోడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. చిన్నారి విద్యార్థులు రంగు రంగుల రంగవల్లులతో పాటు హరిదాసు వేశాధారరణ తో ఆలరించరు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజరాణి, సి ఆర్ పి బాల సాని వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీవాణి, అనూష, శ్యామల బ్యూటీషన్ ట్రేనర్ కీర్తన తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహభావం.. శారీరక దారుఢ్యం

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** క్రీడలు స్నేహభావం.. శారీరక దారుడ్యానికి దోహద పడుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి లోని సర్దాపూర్ 17వ బెటాలియన్ లో వార్షిక స్పోర్ట్స్ మీట్ పోటీలు మూడురోజులుగా కొనసాగుతున్నాయి. 100, 200, 400, 800, 5 కిలోమీటర్ల పరుగు పందెం, క్రికెట్, వాలీబాల్, షెటిల్, క్యారం, చెస్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం ముగింపు పోటీలు నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా పోలీస్ ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 100 మీటర్ల పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్ పోటీలను ఇంచార్జి కలెక్టర్, బెటాలియన్ కమాండెంట్ సురేష్ తో కలిసి ప్రారంభించారు. 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి తిరుపతి, రెండో బహుమతి శ్రీహరి, మూడో బహుమతి సురేష్ నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పోటీల్లో కంపెనీ ఏ జట్టు, ఎస్డీఆర్ఎఫ్ జట్లు రెండు రౌండ్లలో హోరాహోరీగా తలపడ్డాయి. రెండు రౌండ్లలో ఎస్డీఆర్ఎఫ్ జట్టు మంచి టీం వర్క్, సరైన పట్టుతో విజయం సాధించింది. విజేతలకు ఇంచార్జి కలెక్టర్, బెటాలియన్ కమాండెంట్ బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. వార్షిక క్రీడలు రోజువారి ఒత్తిడిని దూరం చేస్తాయని, ఉద్యోగుల అందరి మధ్య స్నేహభావం, జట్టుగా ఎలా గెలుపు సాధించాలి అనే విషయాలకు దోహదం చేస్తాయని తెలిపారు. ఆటలతో శారీరక దారుడ్యం మెరుగుపడుతుందని వివరించారు. బెటాలియన్, ఎస్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వరదలు వచ్చినప్పుడు బాధితుల రక్షణ, సురక్షిత ప్రాంతాలకు తరలింపు, ఎన్నికల బందోబస్తు, జాతరల వద్ద ఎంతో విలువైన సేవలు అందిస్తున్నారని ఇన్ ఛార్జ్ కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్, సురేష్, ఆర్ఐలు కుమారస్వామి, శ్రీనివాస్, శ్యాం రావు, రాంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యం

### ఆది శ్రీనివాస్ వ్యూహరచన

**ప్రజా పక్షం/ వేములవాడ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వేములవాడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు దూకుడు పెంచాయి. ఈ మేరకు పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల వ్యూహరచన చేశారు. పట్టణంలోని మొత్తం 28 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా పక్కా ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా ఈ సమావేశంలో 28 వార్డుల నుండి కౌన్సిలర్‌లుగా పోటీ చేయాలనుకునే ఆశావాహుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అభ్యర్థుల బలాబలాలు, క్షేత్రస్థాయిలో వారికున్న ఆదరణపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి వార్డులో పార్టీ విజయానికి కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చేర్మెన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌ డ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, అభ్యర్థిత్వం ఆశిస్తు న్న ఆశావాహులు,ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై పోలీసుల కఠిన చర్యలు

**ప్రజాపక్షం/కరీంనగర్:**నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. గడిచిన ఏడాది 2025 జనవరి ఒకటి నుండి 2025 డిసెంబర్ 31 వరకు నగరవ్యాప్తంగా వివిధ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ సంఖ్యలో కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి.కరీం ఉల్లాఖాన్ వెల్లడించారు. నగరంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన 750 అత్యాధునిక నిఘా నేత్రాల (సిసి కెమెరాలు) ద్వారా, సిబ్బంది ప్రమేయం లేకుండానే ఆన్‌లైన్ పద్ధతిలో ఈ చలానాలు నమోదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ట్రిపుల్ రైడింగ్ 68,484, హెల్మెట్ లేని ప్రయాణం 59,426, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 36,211, ఆన్ రోడ్ పార్కింగ్ 16,607, సెల్ ఫోన్ డ్రైవింగ్ 6,662, డ్రంక్ అండ్ డ్రైవ్ 3,242, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు 3,148 కేసులు నమోదయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, నగర ప్రజల భద్రతే మా ప్రాధాన్యత.



కేవలం జరిమానాల కోసం కాకుండా, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలనే ఉద్దేశంతో ఈ నిఘాను ఏర్పాటు చేశాం. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం మరియు రాంగ్ సైడ్ డ్రైవింగ్ మానుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సి.సి. కెమెరాల ద్వారా నేరుగా చలాన్లు ఇంటికి వస్తాయని, కావున ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించిపోలీసులకుసహకరించాలనిఆయనవిజ్ఞప్తి చేశారు.

# సంస్కృతి,సంప్రదాయాలకు వారధులుగా నిలవాలి

### ప్రజ్ఞ వికాస తరంగిణి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు




**ప్రజాపక్షం/చొప్పదండి:**సంస్కృతి సాంప్రదాయాలకు వారధులుగా నేటితరం విధ్యార్థులు నిలవాలని ప్రజ్ఞ వికాస తరంగిణి రాష్ట్ర అధ్యక్షుడు ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని ఆర్నకొండ గ్రామంలోని అక్షయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. విధ్యార్థి దశలోనే పండుగలపై అవగాహనను పెంచుకోవాలని సూచించారు. విధ్యార్థుల అభ్యున్నతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. గ్రామీణ వాతావరణంలో క్రమశిక్షణతో కూడిన పాఠశాలను నడిపించి విధ్యార్థుల భవితకు బాటలు వేయడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విధ్యార్థుల తల్లులు వేసిన ముగ్గులు అలరించాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తమ్మడి కనకరాజు, ప్రిన్సిపాల్ తమ్మడి శ్రీమతి, ట్రస్మా మండలశాఖ అధ్యక్షుడు గుర్రపు ఆనందరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

## వృద్ధుల డే కేర్ సెంటర్‌లో అన్ని వసతులు కల్పించాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :**వృద్ధుల డే కేర్ సెంటర్ లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్ లో వృద్ధుల డే కేర్ సెంటర్ ను త్వరలో ప్రారంభించనుండగా, ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. వృద్ధుల డే కేర్ సెంటర్ ను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వృద్ధులకు ఏర్పాటు చేసిన క్యారం బోర్డ్స్, చెస్ ఇతర ఆట వస్తువులు పరిశీలించారు. ఇక్కడ ఎందరు వృద్ధులు సేద తీరవచ్చని ఆరా తీశారు. వృద్ధుల డే కేర్ సెంటర్ లో దినపత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు, కథల పుస్తకాలు అందుబాటులో పెట్టాలని, టీ, స్నాక్స్ అందించేందుకు వంట పాత్రలు, కప్పులు సిద్ధంగా పెట్టాలని సూచించారు. ఫ్లోరింగ్ పై మంచి మ్యాట్ వేయించాలని, ఇతర సామగ్రి తీసుకోవాలని, ఫిజియో థెరపి, పాలియేటీవ్ సేవలు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, తహసిల్దార్ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం సభ

**ప్రజాపక్షం/శంకరపట్నం:**మండల పరిధిలోని లింగాపూర్, యెరడపల్లి గ్రామాలలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం సభను ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పద్మ, అరుణల ఆద్వర్యంలో నిర్వహించారు. యెరడపల్లి గ్రామంలో సర్పంచ్ కొయ్యడ రజిత, లింగాపూర్ మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడ సెంటర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి సరైన సమయంలో గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, ప్రతి నెల బరువు చూపించుకోవాలన్నారు. చక్కెర,నూనె వినియోగాలు తగ్గించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ మనోచిత్ర, గ్రామ కార్యదర్శి అజయ్ కుమార్, వార్డు సభ్యులు , అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, సుభద్ర, ఆశ, తల్లులు, పిల్లలున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహనే అప్రమత్తత:ఎస్ఐ శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/శంకరపట్నం:**శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం ఎస్సై శేఖర్‌రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పల్లె పట్టణం అనే తేడా లేకుండా సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్ల్ చైల్డ్ సేఫ్టీ కోసం స్నేహిత, షీటీమ్స్ తో పాటు అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. మొబైల్ ఫోన్లు వినియోగించే విద్యార్థులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఫోన్‌పే,గూగుల్‌పే వంటి డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్, ఉపాధ్యాయులు నాగమణి, సతీష్, శివశంకర్, విద్యార్థులున్నారు.

## సర్పంచ్‌లకు సన్మాన సభ

**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి, తెలంగాణ ముదిరాజ్ జెఎసి సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల



సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పోల్కం లక్ష్మి నారాయణ, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు లింగాల పుష్పలత, ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, గౌరీ శంకర్, మన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యవిభాగం మంద నగేష్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల కిషన్, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ముదిరాజ్ జేఏసీ కరంనగర్ జిల్లా చైర్మన్ గోనెల సమ్మన్న, అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

ప్రజాపక్షం/ముత్తారం : గ్రామ అభివృద్ధిలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్ అన్నారు. శుక్రవారం ముత్తారం మండలంలోనిమైదంబండ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ బియ్యని శివకుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ మద్దతు కమిటీ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. సమావేశం అనంతరం గ్రామానికి చెందిన చిన్నారులకు సర్పంచ్ చేతుల మీదుగా అన్నప్రసన్నం, అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారి లోకానికి అక్షర విజ్ఞానాన్ని అందించడం, పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణీలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, కేంద్రాల నిర్వహణలో నాణ్యత పాటించాలని సర్పంచ్ సూచించారు. బాలల పరిరక్షణ కమిటీ సమావేశం కమిటీ సభ్యులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రంలోని వసతులు, రికార్డుల నిర్వహణ హాజరుపై చర్చించారు. కేంద్రంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోరారు. అనంతరం అంగన్వాడి సిబ్బంది ఏఎన్ఎంలు కలిసి సర్పంచ్,ఉప సర్పంచ్ లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పిట్టల రామస్వామి,వార్డు సభ్యులు రేకుంట్ల రాజు,జక్కుల చంద్రమౌళి, దారా శంకర్,బియ్యాని నరేష్,కలవీన నవలోక, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా సిబ్బంది, మహిళా సమాఖ్య ప్రతినిధులు తోపాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రహదారి నిబంధనలను కచ్చితంగా పాటించాలి

### జిల్లా రవాణా అధికారి రంగారావు

ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని పెద్దపల్లి జిల్లా రవాణా అధికారి రంగారావు అన్నారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని రంగాపూర్ గ్రామంలో గాయత్రి కళాశాల ఎన్ఎస్ఎస్ ఐదవరోజు శిబిరంలో భాగంగా ముఖ్య అతిథులుగా రంగారావు,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుతో కలసి పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు అనేక కుటుంబాలను తీవ్ర విషాదం వైపు నెట్టుతున్నాయని, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, నేడు యువత చాలా మంది మద్యం తాగి మత్తు పదార్థాలు తీసుకొని వాహనాలు నడపడం, మితిమీరిన వేగం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వారి వల్ల 18 నుండి 45 సంవత్సరాలు ఉన్నవారు ప్రతి సంవత్సరం కొన్ని వేలాదిమంది క్షతగాత్రులుగా మారుతున్నారని,హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం వల్ల 60%ప్రాణాలు రక్షించుకోవచ్చు అని సూచించారు. మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయరాదని ముందు వచ్చే పెద్ద వాహనాలను ఓవర్టేక్ చేయరాదని జీబ్రా లైన్స్ గమనించి పాదాచారులను గమనిస్తూ జాగ్రత్తగా రోడ్లపై వాహనాలు నడపాలని సూచించారు. ఈ విషయాలు గ్రామంలో ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. తర్వాత జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో ముఖ్య అతిథులు రంగారావు మరియు మధు మొక్కలు నాటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల చేత మొక్కలు నాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పీ. శారద ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం ఏ సమద్, ఉపాధ్యాయులు ఆమని, కుమార్, రాజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

### తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా చేయడం పిల్లల బాధ్యత

### ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పెద్దపల్లి ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రంగంపల్లి లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో రోడ్ భద్రత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత వివరించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా చేయడం పిల్లల బాధ్యత అని గుర్తుచేశారు. రోడ్డు భద్రతా నియమాల ప్రాధాన్యతను వివరించారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ మాట్లాడకూడదని, అధిక వేగంతో వాహనం నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడవడం ప్రాణాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ నిబంధనలు క్రమంగా పాటిస్తూ గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ శాఖ నుండి రెసిడెన్షియల్ స్కూల్లో చదివే విద్యార్థులకు తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమనిబంధనలు పాటిస్తూ, హెల్మెట్ వాడుతామని, సీట్ బెల్ట్ పెట్టుకుంటామని, వాహన సంబంధిత అన్ని పత్రాలు సరిగా ఉంచుకునేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించి వారి వద్ద నుండి ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తాం అని అండర్ పత్రం తీసుకురావాలని విద్యార్థులకు పత్రాలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ సహదేవ్ సింగ్ ప్రిన్సిపాల్ మణిదీప్తి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :తెలంగాణలో క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, క్రిస్మస్ సంబరాలకు తొలిసారిగా ప్రార్థన మందిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30000 కేటాయించడం జరిగిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజున క్రిస్టమస్ పండుగ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు ప్రార్థన మందిరాల నిర్వహణకు ప్రభుత్వం తరుపున ఒక్కో ప్రార్థన మందిరానికి 30 వేల చొప్పున మొత్తం 16 చర్చిలకు రూ. 4.80 లక్షల విలువ గల చెక్కులను చర్చి నిర్వాహకులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవులకు అండగా ఉంటుందని మొట్టమొదటి సారిగా ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ క్రిస్టమస్ వేడుకల నిర్వహణకు పలు ప్రార్థన మందిరాలకు 30 వేల చొప్పున ఆర్థికంగా చేయూతను అందిస్తుందని అన్నారు. దానికి అనుగుణంగా పెద్దపల్లి నియోజకవర్గంలో శుక్రవారం రోజున 16 చర్చిలకు రూ. 4.80 లక్షల విలువ గల చెక్కులను అందజేసి ప్రభుత్వం తరుపున క్రైస్తవులకు చేయూతను అందించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యతను ఇస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, పలు చర్చిల నిర్వాహకులు, క్రిస్టియన్ మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ నక్సలైట్‌కు నివాళులు

ప్రజాపక్షం/ముత్తారం: ముత్తారం మండలం మైదంబండ గ్రామానికి చెందిన కామ్రేడ్ శారద ఇటీవలే మృతిచెందగా మృతురాలు కుటుంబాన్ని రామగిరి మండల మాజీ ఎంపిపిఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ తోపాటు తదితరులు మృతురాలి చిత్రపటానికి పూల మాలలు వేసి సంతాప వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజగౌడ్, ఎంపీడీఓ రవీందర్‌తో కలిసి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిమాణం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల పరిశుభ్రతను తనిఖీ చేశారు.ఆహార పదార్థాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై సమీక్షించారు .తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో పాఠశాలలో అందిస్తున్న విద్యా బోధనపై చర్చించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ బీమా చెక్కు అందజేత

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన పబ్బ సరోజన అనే మహిళ మండల కేంద్రం లోని యూనియన్ బ్యాంకు ఖాతా ద్వారా కేంద్ర ప్రభుత్వం బీమా పతకమైన ప్రధానమంత్రి జీవన జ్యోతి జెజెబి వై భీమా యోజన నమోదు చేయించుకున్నారు . దురదృష్టవశతు ఇటీవల కాలంలో మరణించడం జరిగింది. కుటుంబ సభ్యులు సంబంధిత పత్రాలను బ్యాంకు వారికి సమర్పించగా, భీమాకు సంబంధించిన రెండు లక్షల రూపాయలను నామిని పబ్బ లచ్చయ్యకు గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ కాశ అంజలి గంగాధర్ పంచాయతీ కార్యదర్శి విక్రమ్ వివో ఏ జయపాల ఆధ్వర్యంలో పబ్బ లచ్చయ్యకు అందజేయడం జరిగింది. అనంతరం నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ లకు వివో ఏ జయపాల ఎఫ్ ఎల్ సి మధుసూదన్ సి ఎఫ్ ఎల్ రమేష్ వెంకటేష్ విజయ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ప్రతి ఒక్కరూ భీమా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎల్ సి మధు సుధన్, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు రమేష్, వెంకటేష్, విజయ్, మరియు గ్రామ సర్పంచ్ కాశ అంజలి గంగాధర్.ఉప సర్పంచ్ అంజయ్య. సిసి మహేష్ వివో ఏ జయపాల కార్యదర్శి విక్రమ్ అంగన్వాడి టీచర్ హరిత లాల్ మరియు మహిళా సంఘ సభ్యులు. గ్రామస్తులు,సిబ్బందిపాల్గొన్నారు.

# జీవనజ్యోతి యోజన జీవిత బీమా చెక్కు పంపిణీ



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామానికి చెందిన షేర్ విజయ గత రెండు నెలల క్రితం చనిపోవడం జరిగింది. అయితే షేర్ విజయ ఆర్థిక అక్షరసత కేంద్రం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన జీవిత భీమా పథకం(436) చేయించుకోవడం జరిగింది.నామిని అయిన షేర్ రమేష్ కి శుక్రవారం ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రెండు లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ నరేన్, ఆర్థిక అక్షరాస్యత సిబ్బంది. గట్టు స్వామి,వరుణ్ కుమార్,నరేష్ పాల్గొన్నారు.

# సమాచార హక్కు చైతన్య సమితి జిల్లా కన్వీనర్‌గా సయ్యద్ జావిద్ పాషా

ప్రజాపక్షం/ముత్తారం : సమాచార హక్కు చైతన్య సమితి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ జావిద్ పాషా నియమిస్తున్నట్లు వ్యవస్థకు అధ్యక్షులు సాదుల పూర్ణచందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ జావిద్ పాషా మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్ గా నియమించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిబంధనలకు లోబడి, కమిటీ నిర్ణయాలకు, వ్యవస్థాపక అధ్యక్షుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ ప్రజలందరి మేలు కోసం కృషి చేస్తామన్నారు.

# పంచరామి గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/సుల్తానాబాద్: మంచిరామి గ్రామంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సరఫరాకు గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి శాశ్వత పరిష్కారంగా నూతన గేట్ వాల్ ఏర్పాటు చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రామంలోని అంగన్వాడి పాఠశాలలో నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పు లక్ష్మి పాల్గొని పిల్లలకు స్వయంగా భోజనం తినిపించారు.అలాగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి, వారికి అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి, అలాగే గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ ఉప్పు లక్ష్మి తెలిపారు.

# గంజాయితో యువకుడి పట్టివేత



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో యువకుడు గంజాయితో వెళుతున్నాడనే సమాచారంతో ధర్మపురి స్ఐ గురుక మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో గంజాయితో యువకుడు పట్టుబడ్డాడు.ఎస్ఐ మహేష్ కథనం ప్రకారం.. ధర్మారం మండలానికి చెందిన కూతాడి దుర్గాప్రసాద్ ను ధర్మపురి వద్ద పోలీసులు తనికీ చేయగా అతడివద్ద 129 గ్రాముల గంజాయి దొరికినట్లు ఎస్సై తెలిపారు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తాను మంచిర్యాలకు చెందిన కంద్రకొండ వెంకటేశ్ నుండి గంజాయి తీసుకున్నట్లు చెప్పగా వెంకటేష్ ను సైతం అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్ర నుండి గుర్తుతెలియని వ్యక్తి నుండి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తానని చెప్పాడు.ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.కానిస్టేబుళ్లు రమేష్ నాయక్,రణధీర్ ఉన్నారు.

## గ్రామ పంచాయితీ మొదటి గ్రామ సభ

**ప్రజాపక్షం/సారంగాపూర్:** గ్రామంలోని సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని పెంబట్ల సర్పంచ్ కొలపాక రాధ రాజు పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో మొదటి గ్రామ సభ సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా పెంబట్ల సర్పంచ్ రాధ రాజు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజిలు, సిసి రోడ్లు, ఇంకుడు గుంతలు, మహిళా సంఘ భవనము కొత్త పనుల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఉప సర్పంచ్ మైదం ప్రభాకర్, ఏపిఎం చంద్రకళ, వార్డు సభ్యులు తోట లక్ష్మణ్, తేలు విజయ, దొంగ జ్యోతి, ముద్దం చిరంజీవి, మంగళపల్లి లచ్చం, తోట మల్లయ్య, పత్రి లక్ష్మి, బొద్దు పల్లి రాజేష్, పత్తి గంగు, సిసి రమేష్, వివోఏలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక దందా ఆగదు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే పట్టుకొని ట్రాక్టర్లను సీజ్ చేస్తామని భారీగా జరిమానాలు విధిస్తామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రకటనల ద్వారా మల్లాపూర్ తాసిల్దార్ చేసిన హెచ్చరికలు అప్పటివరకే అన్నట్టు ఉన్నా యి. ప్రతిరోజు గోదావరి తీర ప్రాంతాల గ్రామాల నుండి నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలి వెళ్తున్న పట్టించుకునే నాధులే కరువయ్యారు. అక్రమంగా లారీలలో జి ల్లాల సరిహద్దులు దాటి తరలి వెళ్తున్న ఇసుకను మాత్రం అధికారులు ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

## గ్రామపంచాయతీ నిధుల వివరాలు అందించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వాల్గొండా గ్రామ పంచాయతీ పరిధిలో 2022 నుండి 2025 డిసెంబర్ చివరి వరకు జరిగిన గ్రామపంచాయతీ నిధుల లావాదేవీల వివరాలను అందించాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నారు. 15th ఫైనాన్స్ ద్వారా వచ్చే నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధుల వివరాలు, నిర్మించిన ఇండ్ల పర్మిషన్లు, హౌస్ టాక్స్,వివరాలుఅందించాలనిదరఖాస్తులు కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండలం మల్యాల,తక్కల్లపల్లి 33/ 11 కెవి సబ్ స్టేషన్ల లో నెలవారీ విద్యుత్ మరమ్మత్తుల నిర్వహణ జరుగుతున్నందున విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4. గంటల వరకు నిలిపి వేయనున్నట్లు మల్యాల ట్రాన్స్కోఏ ఈ దయా నంద్ ఒక ప్రకటనలో తెలిపారు.దీని వలన మల్యాల సబ్ స్టేషన్ పరిధిలో మల్యాల, ముత్యంపేట, రాజారాం, నూకపల్లి మల్యాల క్రాస్ రోడ్ గ్రామాలకు,తక్కలపల్లి సబ్టేషన్ పరిధిలో తక్కలపల్లి, మ్యాడం పల్లి , మానాల గ్రామాల గృహ వినియోగదారులకు వ్యవసాయబావులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వివరించారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు రైతులు సహకరించాలని ఏఏ కోరారు.

## అభివృద్ధి పథంలో ధర్మపురి



**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వికలాంగులు,వయోవృద్ధుల శాఖామంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ధర్మపురి ప్రగతిపథంలో పయనిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్ తెలిపారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉపాధ్యక్షులు వేముల రాజేష్,దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్,పార్టీ పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ లతో కలిసి విలేకరులతో మాట్లాడారు.మండలంలోని వివిధ కులసంఘ భవనాల నిర్మాణాలకు మంత్రి అడ్లూరి సహకారంతో సీఎస్ఆర్,ఎస్డీఎఫ్ ల నుండి రూ.కోటిన్నర నిధులుమంజూరు చేయడం పట్ల కుల సంఘాల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా వివిధ అభివృద్ధి పనుల కొరకు సీఎస్ఆర్ గ్రాంటు నుండి రూ.50 లక్షలు,ఎస్డీఎఫ్ నుండి కోటి నిధులు మంజూరు అయ్యాయని దినేష్ చెప్పారు.గత రెండేళ్లలో టీయూఎఫ్ఐడిసి నిధుల నుండి సుమారు రూ.30 కోట్లతో పలు వార్డుల్లో నూతన సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలు ప్రారంభించగా పనులు చివరిదశలో వున్నాయని పేర్కొన్నారు. పట్టణంలో ఎక్స్టెన్షన్ పోల్స్ కింద రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. నగర అభివృద్ధి కింద రూ.15 కోట్లు కేటాయింపు చేయగా టెండర్ ప్రక్రియ పూర్తికావస్తున్నదని వివరించారు. ఏరోనాటికల్ సంస్థ ప్రతినిధులు ధర్మపురి లో డిగ్రీ కళాశాల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పర్యటించారని,గోదావరి నది సీవరేజి ప్లాంటు ఏర్పాటుకు రూ.17 కోట్లు నిదులు విడుదలకై మంత్రి చర్యలు చేపట్టినట్లు దినేష్ చెప్పారు.రాబోవు రోజుల్లో ధర్మపురి రూపురేఖలు పూర్తిగా మారే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ధర్మపురి ప్రాంత ప్రజల పక్షాన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.నాయకులు సింహరాజు ప్రసాద్,రఫియోద్దీన్, తిరుపతి, రాజేష్ పాల్గొన్నారు.

## ట్రినిటీ కాలేజీలో నేషనల్ లెవెల్ యూత్ ఫెస్ట్ మేధా 2026

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ లో బొమ్మకల్ లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా మేధా 2026 నేషనల్ లెవెల్ యూత్ ఫెస్ట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జబర్దస్త్ వెంకీ హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 2300 మంది విద్యార్థులు 25 రకాల ఫార్మల్ మరియు ఇన్ఫార్మల్ ఈవెంట్స్ పోటీలలో పాల్గొన్నారు. కళాశాల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ఒక వికసిత భారత్ 2047 లక్ష్యం పేరుతో విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్ వృత్తిపరమైన నైపుణ్యాలు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్ గా ఏర్పడిన సందర్భంగా ప్రపంచంలో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు అన్ని రకాల నైపుణ్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జబర్దస్త్ వెంకీ తన హాస్యంతో విద్యార్థులను ఉత్తేజపరిచి ,విద్యార్థులు భవిష్యత్తులో రాణించి ఉన్నత స్థాయిలో నిలబడాలంటే దృఢ సంకల్పంతో కృషి చేయాలని వారి కుటుంబానికి , కళాశాలకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాట్లాడారు. ట్రినిటీ కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో యువశక్తి జనాభా ఎక్కువగా ఉన్న దేశం మన భారతదేశం కాబట్టి విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి ఏఐ టెక్నాలజీకి అనుగుణంగా అన్ని రకాల నైపుణ్యాలను సాధించి ఉద్యోగాలు చేయడం కన్నా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అంకుర సంస్థలను స్థాపించాలని ప్రపంచ మార్కెట్ కనుగుణంగా అభివృద్ధి దిశలో ఆలోచించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, అకాడమిక్ డైరెక్టర్ బి.రాజగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ పి.కిషోర్, ఏవో రాజశేఖరరెడ్డి, ఎంబీఏ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ సంతోషి, రజిత రెడ్డి, ఇలియాస్ అలీ, అజారుద్దీన్, సుప్రియ పాల్గొన్నారు.

## మామిడి తోటను పరిశీలించిన ఉద్యానవన అధికారి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామంలో మోహన్ రెడ్డి కి చెందిన మామిడి తోటను డివిజనల్ ఉద్యాన అధికారి అర్చన శుక్రవారం పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కేవలం 20శాతం మామిడి తోటలలో మాత్రమే పూత వచ్చినట్లు ఇంకా పూత వస్తున్న దశలోనే మామిడి తోటలు ఉన్నాయని అన్నారు. తీవ్రమైన చలి ప్రభావం వల్ల మామిడిలో పూత రావడం ఆలస్యమైందన్నారు . మామిడిలో పూత దశ మూడు రకాలుగా ఉంటుందని పచ్చి పూత దశ ,తెల్ల పూత దశ, జొన్న రవ్వంత పూత . పచ్చి పూత దశలో మాత్రమే పురుగుల మందులు పిచికారి చేసుకోవడానికి ఆస్కారం ఉంటుందని రైతులకు తెలిపారు. మామిడి తోటలు అన్ని ఒక మోస్తారు వరకు పచ్చి పూత దశలోనే ఉన్నట్లు తెలిపారు. పచ్చి పూత దశలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చని చెప్పారు. పచ్చి బూత దశలో నీమ్ అల్ట్రా 0.5 మిల్లి లీటర్, టోల్ఫెన్పైరాడ్ 15 ఇ సి 1మిల్లి లీటర్ నీళ్లు , ప్రొపైకనాజోలు,1 మిల్లీలీటర్ నీటిలో ఈ మూడింటి మిశ్రమాన్ని పైన తెలిపిన న విధంగా కలుపుకొని పిచికారి చేసినట్లయితే తేనె మంచు పురుగు,, తెల్ల దోమ తామర పురుగులు వంటి కీటకాల నుంచి మామిడి పూతను కాపాడుకోవచ్చు అన్నారు . తెల్ల పూత దశలో ఉన్న మామిడి తోటలలో ఎటువంటి పురుగుల మందులను పిచికారి చేయకూడదు ఎందుకంటే పరాగసంపర్కం కీటకాలు నాశనమై పూత రాలిపోవడం జరుగుతుందని అన్నారు . మామిడి రైతులు పైన తెలిపిన విధంగా సలహాలు పాటించాలని ఉద్యాన అధికారి కోరారు. అలాగే అయిల్ పామ్ పంట వేయటానికి రైతులు ముందుకు రావాలని సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలని ,చెప్పారు . ఈ కార్యక్రమంలో ఉద్యానవిస్తరణ అధికారి వంశీ కృష్ణ రైతులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి మంత్రి పరామర్శ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్లలా రామ్ మోహన్ రెడ్డి తల్లి సరోజన ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సరోజన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్ మోహన్ రెడ్డి ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు ,నిశాంత్ రెడ్డి ,లోతునూర్ సర్పంచ్ శోభన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## కెజిబివి పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండలం కెజిబివి పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల తీరును పరిశీలించారు. ప్రతి క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు అని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని హాజరు పట్టికను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, పారిశుద్ధ్య సౌకర్యాలు,విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో మధు సూదన్, డి.ఈ.వో. కె. రాము, ఎంపిడివో స్వాతి, ఎం ఈ వో జయ సింహ రావ్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదులో తప్పుల సవరణ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలో ఓట్ల జాబితాలో తప్పుల తడకగా ఉన్నాయని వాటిని వెంటనే సవరించాలని బీఆర్ఎస్ పార్టీ అద్వర్యం లి నిరసన తెలిపారు.పట్టణంలో ని వార్డులలో భార్య ఓటు ఒక వార్డులో భర్త ఓటు ఒక వార్డులో ఉన్నయని నక్కల పేట,కమలాపూర్ ఇందిరమ్మ కాలనీ లో స్వంత గృహాలు కట్టుకొని 10 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న కూడా వారి ఓట్లు గతములో కిరాయి ఉంటున్న వార్డులలోనే ఓట్లు ఉన్నాయన్నారు. 6వ వార్డ్ లక్ష్మీ నరసింహ కాలనీకి సంబంధించిన 180 ఓట్లు 14 వార్డులో పడినవి.13వ వార్డులో దాదాపు 120 ఓట్లు ఇతర వార్డులకు సంబంధించిన ఓట్లు పడినవి.9వ వార్డులో కూడా ఇలాంటి సమస్యలే కాకుండా మండలం లోని ఇతర ఊర్ల కు సంబంధించిన ఓట్లు కూడా వివిధ వార్డులలో ఇక్కడ నివాసం ఉన్నట్టు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మండల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్,సీనియర్ నాయకులు చిలువేరి శ్యాంసుందర్, ఒడ్నాల మల్లేశం,చిర్నేని నర్సయ్య.మాజీ కౌన్సిలర్లు ,నాయకులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

**ప్రజా పక్షం /మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో గత ఏడాది నవంబర్ లోజరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించిన 31 బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 83 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ లక్షలాది రూపాయలు అప్పులు చేసి సామాగ్రి తెచ్చుకున్న దుకాణదారులు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దుస్థితిని చూసి ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ప్రమాద ఘటనను తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జిల్లా నుండి సమగ్ర నివేదిక సమర్పించామని తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.83,12,000 రూపాయలు విద్యుత్ సంస్థ నుంచి రూ.29 లక్షలు, డీఆర్డీఓ ద్వారా మరో రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమన్నారు.అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు మళ్లీ యథావిధిగా వ్యాపారం చేసుకునేలా భవిష్యత్తులో కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.అదేవిధంగా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి దేవాలయం, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాలను టెంపుల్ సిటీ కారిడార్గా అభివృద్ధి చేస్తామని, కొండగట్టు గిరి ప్రదక్షిణ మార్గం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు.ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ కొండగట్టు ప్రాంతంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న వారి దుకాణాల్లో అగ్ని ప్రమాదం వారి కుటుంబాలను చిన్నభిన్నం చేసిందనీ వారి పరిస్థితి గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా హామీ ఇచ్చిన మాట కు కట్టుబడి బాధితులను ఆదుకోవడం జరిగింది.ప్రజల కష్టాల్లో తోడుంటామని ప్రభుత్వం ఏర్పడినప్పుడే చెప్పామని, నియోజకవర్గం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు.ప్రభుత్వం కొండగట్టు ఆలయ అభివృద్ధి కి భారి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రమాద ఘటన తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి జిల్లా నుండి సమగ్ర నివేదిక సమర్పించామని తెలిపారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వ్యాపారులు ప్రభుత్వం అందించిన సహాయంతో తిరిగి వ్యాపారాలు ప్రారంభించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మాకు అన్నివేళలా అండగా మద్దతు ఇచ్చిన సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డిఆర్డివో రఘువరన్, ఎస్.ఈ సుదర్శన్, డి.ఈ గంగారాం, ఎమ్మార్వో, ఎంపిడివో, విద్యుత్ శాఖ అధికారులు, ముత్యంపేట సర్పంచ్ దారం అది రెడ్డి, మాజీ సర్పంచ్ బత్తి శ్రీనివాస్ గౌడ్ ,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యపు శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి,తదితర కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హిందీ భాషపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** నేటి కాలంలో హిందీ భాష ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నందున అందరూ ఆ భాష పట్ల అవగాహన పెంచుకోవడం అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వ హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అధికంగా మాట్లాడే భాషలలో హిందీ ఒకటని, ప్రపంచ భాషలలో దీనికి మూడవ స్థానం ఉందని వివరించారు. ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 12 విశ్వ హిందీ సమ్మేళనాలను వివిధ దేశాలలో నిర్వహించినట్లు గుర్తుచేశారు. హిందీ భాష నేర్చుకోవడం ద్వారా యువతకు ఎన్నో రకాలుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అందరూ హిందీ మాట్లాడటం అలవర్చుకోవాలని సూచించారు.హిందీ విభాగం అధిపతి డి జనార్ధన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

## సామాజిక కార్యకర్తలకు పార్టీ టికెట్లు ఇవ్వాలి

### టిబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు మోతె

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** రాష్ట్రంలో సంవత్సరాలుగా ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్తలకు రాజకీయ పార్టీల్లో తగిన గుర్తింపు ఇచ్చి రాబోయే ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం (టిబిఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు మోతె కోరారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆల్ ఇండియా ఎస్‌సి, ఎస్‌టి వేదిక జిల్లా అధ్యక్షుడు గుడిసెల రాజారాంతో కలిసి ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పట్ల అవగాహ న ఉన్న వారికి ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే పా లన ప్రజోపయోగంగా మారుతుందని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సామాజిక కార్యకర్తలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. టిబిఎస్ఎస్ సభ్యులు హుస్సేన్, సమ్మయ్య పాల్గొన్నారు.

## రక్తహీనతను నిర్లక్ష్యం చేయవద్దు

### డాక్టర్ రవీందర్ కుమార్

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** రక్తహీనతను చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయి తగ్గడమే రక్తహీనత అని, దీని వల్ల అలసట, నీరసం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుందని వివరించారు. ప్రధానంగా మహిళలు, గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు దీని బారిన పడుతున్నారని తెలిపారు. పోషకాహార లోపం, ఐరన్, విటమిన్ బి12 లోపం వల్ల ఈ సమస్య వస్తుందని పేర్కొన్నారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే గుండె సంబంధిత వ్యాధులు రావడం, రోగనిరోధక శక్తి తగ్గడం జరుగుతుందని, పిల్లల్లో శారీరక మానసిక ఎదుగుదల మందగిస్తుందని స్పష్టం చేశారు. ఆకుకూరలు, బెల్లం, ఖర్జూరం, మాంసాహారం వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

## సంక్రాంతి ప్రయాణాల్లో భద్రతా చర్యలు పాటించాలి

### దేవాపూర్ ఎస్ఐ గంగారాం



**ప్రజాపక్షం / కాసిపేట :** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊర్లకు వెళ్లేటప్పుడు ఇళ్లు ఖాళీగా ఉండటంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవాపూర్ ఎస్ఐ గంగారం సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసు శాఖ చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ ప్రయాణానికి ముందు ఇంటి చిరునామా, వెళ్లే తేదీలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేస్తే పెట్రోలింగ్ సమయంలో నిఘా ఉంచడానికి వీలవుతుందని, నగదు, ఆభరణాలు ఇంట్లో కాకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, ఇంటికి బలమైన తాళాలు, కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో పాటు సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులకు సహకరిస్తే దొంగతనాలు పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు.

## నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

### మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం నాయక్



**ప్రజాపక్షం / కాసిపేట :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం నాయక్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాసిపేట కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర వస్తువులు మాత్రమే వినియోగించాలని సూచించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని సమీక్షించడంతో పాటు విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. సంక్రాంతి సెలవుల్లో ఊర్లకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో పాటు చదువు రాని వారికి చదువు నేర్పాలని హితవు పలికారు. అనంతరం ధర్మరావుపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో యూరియా నిల్వలను పరిశీలించి రైతులకు ఎటువంటి కొరత లేకుండా ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

### మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్



**ప్రజాపక్షం / నస్పూర్ :** మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ సూచించారు. నస్పూర్‌లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్‌లో మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ లభిస్తుందని, నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని, ఈవ్ టీజింగ్‌కు గురైనప్పుడు భయపడకుండా డయల్ 100 లేదా షీ టీమ్‌ను సంప్రదించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు సంబంధించి 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు. జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కల్పించారు. అపరిచితుల అనుచిత ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని, మహిళల భద్రత కోసం టిసేఫ్ యాప్ వినియోగించుకోవాలని తెలిపారు. ఆపద సమయంలో రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సభిహా సుల్తానా, షీ టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

### హజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్

**ప్రజాపక్షం / హజీపూర్ :** సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ హెచ్చరించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక దుకాణాల్లో తనిఖీ నిర్వహించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. గాలిపటాలు ఎగురవేసే ఉత్సాహంలో ప్రజలు, యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని సూచించారు. చైనా మాంజా గొంతుకు తగిలితే కోసుకుపోయే ప్రమాదం ఉందని, పక్షులు కూడా ఈ దారానికి చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఫ్యాన్సీ, జనరల్ స్టోర్లలో నిషేధిత మాంజా విక్రయిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు వారు ఏ రకమైన దారం వాడుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

## సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

**ప్రజాపక్షం / తిర్యాణి :** సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించాలనే డిమాండ్‌తో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో నిరసన తెలిపారు. టిఎస్‌టిడబ్ల్యుటియు పిలుపు మేరకు తిర్యాణి మండలంలోని పంగిడి మాదర, సుంగాపూర్, గిన్నెధరి, తిర్యాణి, చెలిమేల, రొంపల్లి ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. 2010 ఆగస్టు 23కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఉన్న విషయాన్ని ఎన్‌సిటిఇ సుప్రీంకోర్టుకు స్పష్టం చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. ఎన్ఇపి రద్దు, పాఠశాలల విలీనాల ఉపసంహరణ, ఎన్‌పిఎస్, సిపిఎస్ రద్దుతో కూడిన పాత పెన్షన్ పునరుద్ధరణ వంటి డిమాండ్లను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో జరగనున్న పార్లమెంట్ మార్చ్‌లో భారీగా పాల్గొని తమ సమస్యలను వినిపించాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పిట్లం విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/పిట్లం:** కామారెడ్డి జిల్లా పరిధిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం అథ్లెటిక్స్ అండర్ 20 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగుల పోటీలో పిట్లం మండలకేంద్రానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్.శ్రీరామ్ మొదటి స్థానం సంపాదించి గోల్డ్‌మెడల్ గెలుచుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవిసింగ్ తెలిపారు. శ్రీరాం ఈనెల 18న ఆదిలాబాద్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికనట్లు చెప్పారు. సదరు విద్యార్థిని గ్రామసర్పంచు, గ్రామపెద్దలు అభినందించగా విద్యార్థినిని ప్రోత్సాహిస్తున్న తల్లితండ్రులపై ప్రశంసలు కురిపించారు.

## పతంగుల దుకాణాలను తనిఖీ చేసిన ఎస్ఐ

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని పతంగుల విక్రయ దుకాణాలను పిట్లం ఎస్సై టి.వెంకట్‌రావు శుక్రవారం క్షేతస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర ఆదేశానుసారం పతంగుల విక్రయదారులు చైనా మాంజాలు విక్రయించరాదని సూచించారు. దీంతోపాటు మాంజాల వాడకం వలన జరుగుతున్న అనర్థాలు, పక్షులపై, మనుషులకు జరుగుతున్న హాని గురించి తెలియజేస్తూ మాంజా దారం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో గల రైతు వేదిక భవనంలో ప్రకృతి వ్యవసాయంపై జాతీయ మిషన్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం, మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరుల ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సహజ వ్యవసాయ విధానాలు, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాలు, దేశా ఆవుల ప్రాముఖ్యత, మట్టిలో సూక్ష్మ జీవుల పాత్ర, పంట వ్యయాలు తగ్గించి లాభాలు పెంచుకునే మారాగాలు తదితర అంశాలపై రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి అమర్‌ప్రసాద్, ఏఈఓ సాగర్, గ్రామసర్పంచు అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయాలు నిషేధం

### .. ఎస్ఐ శివకుమార్

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో పతంగుల కొరకు చైనా మాంజా విక్రయాలను నిషేదించడం జరిగిందని, ఈ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా చైనా మాంజా విక్రయించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ హెచ్చరించారు. రానున్న సంక్రాంతి పండగ దృష్ట్యా మాంజాలు విక్రయించరాదని, పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎవరైనా మాంజా విక్రయాలు జరిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని అచ్చంపేట్, నర్సింగ్‌రావుపల్లి, వెల్గనూర్ తదితర గ్రామాలలో శుక్రవారం నాడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులు, అద్యాపకులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు హరిదాసు వేషాధారణలో చూపరులను ఆకట్టుకోగా, మహిళా విద్యార్థులు తమ పాఠశాల ఆవరణలో రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. దీంతోపాటు బాలురు పాఠశాల ఆవరణలో ఆయా రకాల పంతంగులను ఎగురవేసి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు పాల్గొనడమే కాకుండా వారు సైతం పతంగులను ఎగురవేసి ఆనందంగా గడిపారు.



## నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పౌష్టిక విలువలతో కూడిన మెనూ అమలు చేయాలని సూచించారు. వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పది, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

### జన్నారం ఎస్ఐ అనూష

**ప్రజాపక్షం / జన్నారం :** చైనా మాంజా విక్రయించడం, నిల్వ చేయడం లేదా వినియోగించడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జన్నారం ఎస్ఐ అనూష హెచ్చరించారు. మండల పరిధిలో నిషేధిత చైనా మాంజా విక్రయాలపై పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు మాంజా వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నిల్వలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు వైద్య సేవలు అందించడం సంతృప్తినిచ్చింది

### ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ నిర్వాహకుడు మగ్గిడి తిరుపతి

**ప్రజాపక్షం / జన్నారం :** పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా సంతృప్తినిచ్చిందని ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ నిర్వాహకుడు మగ్గిడి తిరుపతి అన్నారు. జన్నారం మండలంలోని కిష్టాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మేధా ఫౌండేషన్ ప్రోత్సాహంతో ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవర్ధన్ రెడ్డి చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. మేధా ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ జిషణ్ రాయ్, ప్రాజెక్ట్ సీనియర్ కోఆర్డినేటర్ అజయ్ కుమార్, స్కూల్ హెడ్మాస్టర్ గుండా రాజన్న, ఉపాధ్యాయులు ధముక కమలాకర్, జడి మురళి, గోవర్ధన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## క్రీడా పోటీల్లో జిల్లాకు మంచి పేరు తేవాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సిఎం కప్ క్రీడా పోటీలలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆకాంక్షించారు. జిల్లా యువజన క్రీడా సేవల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో చేపట్టిన సిఎం కప్ క్రీడలు 2025 టార్చ్ ర్యాలీని జిల్లా ఎస్పి నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, జిల్లా యువజన క్రీడల అధికారి అశ్వక్ తో కలిసి కాగడా వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, వీటి ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. సిఎం కప్ పోటీలలో భాగంగా గ్రామపంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని వివరించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని ఎస్పి నితికా పంత్ సూచించారు. టార్చ్ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొమురం భీమ్ చౌరస్తా వరకు కొనసాగింది.

## ప్రమాద రహిత ప్రయాణం దిశగా సాగాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** రోడ్డుపై వాహనాలు నడుపుతున్నప్పుడు ప్రతి ఒక్కరు ప్రమాద రహిత ప్రయాణం దిశగా సాగాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టిసి డిపోలో డిపో మేనేజర్ రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలకు జిల్లా ఎస్పి నితికా పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, జిల్లా ఫైర్ అధికారి భీమయ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత కీలకమని తెలిపారు. ఆర్టిసిని ప్రమాద రహిత ప్రయాణంగా రూపొందించడంలో డ్రైవర్ల పాత్ర ఎంతో ఉందని, డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యం చేయకూడదని హితవు పలికారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎస్పి నితికా పంత్ పేర్కొన్నారు. భద్రత మాసోత్సవాల్లో భాగంగా డిఫెన్స్ డ్రైవింగ్, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, ప్రథమ చికిత్స అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ, రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాపక్షం / కౌటాల :** గ్రామంలోని పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఏకగ్రీవంగా తీర్మానాలు చేసినట్లు సర్పంచ్ బడగే సంతోష్ తెలిపారు. మండలంలోని తాటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, ఐదు కొత్త బోరింగ్ లు, మహిళా శక్తి భవనం, అంగన్వాడీ కేంద్రం, మాతాజీ ట్రస్ట్ ధ్యాన కేంద్రం భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయించినందుకు ఎంఎల్సి దండే విట్టల్ కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్లపై ఉన్న చెత్త, పెంట కుప్పలు తొలగించాలని, పశువుల, ఎడ్ల బండ్లు రోడ్లపై ఉంచకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. వరద నది అక్రమ ఇసుక రవాణా, పశువుల



అక్రమ రవాణాపై తగు చర్యలు తీసుకోవాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డోంగ్రే కేశవ్ రావు, తొమ్మిది మంది వార్డు సభ్యులు, రెవెన్యూ శాఖ అధికారి సమ్మయ్య, ఫారెస్ట్ అధికారి జి తులసిరాం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ టీచర్స్, ప్రధానోపాధ్యాయులు, ఐకేపి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## క్షయ నివారణకు ప్రభుత్వం చర్యలు

### టిబి ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్



**ప్రజాపక్షం / జన్నారం :** క్షయ నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని టిబి ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని బాదంపెల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఎక్స్రే, సిఫిలిస్ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి నిర్ధారణ అయిన వారిని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని, వారికి పోషణ నిమిత్తం ప్రభుత్వం నుండి నెలకు వెయ్యి రూపాయలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి లక్ష్మీ రాజం, కార్యదర్శి, ఎస్టిఎస్ సురేష్, ఏఎన్ఎం స్రవంతి, లక్ష్మి, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

### మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖ

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** భవిష్యత్తులో కూడా అనేక సేవా కార్యక్రమాలను చేపడతామని మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె చీరలను పంపిణీ చేశారు.గత ఆరు సంవత్సరాల నుండి ట్రస్టు ద్వారా ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. నూకల రమేష్, తూముల నరేష్, సురిమిళ్ళ వేణు, వనపర్తి రాజేష్, మారు మల్లన్న, గుమ్మడి తిరుపతి, బొద్దుల రామ్మూర్తి, సంధ్యారాణి, పూదరి కుమార్, వేల్పుల రవీందర్, అంగిడి రాజేష్, భీమిని రాజేష్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



## ఆరు నెలలైనా పూర్తికాని రోడ్డు పనులు

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై ఆరు నెలలు గడిచినా పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల పరిధిలో పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో రహదారి అంతా దుమ్ముతో నిండిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో దుమ్ము ఎగసిపడుతూ వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన లేదని, కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే రోడ్డు పనులను పునఃప్రారంభించి పూర్తి చేయాలని, అంతవరకు దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎలకపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** గ్రామస్తుల సహకారంతో ఎలకపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని సర్పంచ్ భక్తు రాంచందర్ తెలిపారు. మండలంలోని ఎలకపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలక వర్గ సభ్యులతో కలిసి శుక్రవారం మొదటి గ్రామ సభ నిర్వహించారు. అనంతరం మిషన్ భగీరథ ఏఇ పృథ్వీ రాజ్ తన సిబ్బందితో కలిసి సర్పంచ్‌ను సన్మానించారు. వాడవాడలో మిషన్ భగీరథ నీటిని పర్యవేక్షించి నీటి కొరత లేకుండా చూడాలని, గ్రామంలో ఏ కార్యక్రమమైనా ప్రోటోకాల్ పాటించాలని అధికారులకు సర్పంచ్ సూచించారు. ఉపసర్పంచ్ అనిల్, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏపిఎం అశోక్, మిషన్ భగీరథ వాల్ ఆపరేటర్లు మల్లేష్, సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** చలి తీవ్రత దృష్ట్యా నిరుపేదలు పడుతున్న ఇబ్బందులను గమనించి వారికి దుప్పట్లు అందించామని సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో చప్పిడి పెంటయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ప్రకాశ్, కమలాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు.వార్డు సభ్యులు చౌదరి యశోద గుండయ్య చేతుల మీదుగా ముప్పై మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.వార్డు సభ్యులు మల్లేష్, గ్రామ పెద్దలు పొట్టే గణపతి, గోపాల్, మహేష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం, విద్య అందించాలి

### మండల అభివృద్ధి అధికారి ఆల్బర్ట్

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలని మండల అభివృద్ధి అధికారి ఆల్బర్ట్ అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగది, స్టోర్ గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి సెలవు దినాలలో పిల్లలు ఇంటి దగ్గరే ఉండి చదువుకునే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రమేష్ బాబు, డిటి చిన్ను, ఇంచార్జ్ ప్రత్యేక అధికారి సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** ఆదివాసి పాఠశాలలకు అన్ని విధాల వసతులు కల్పించాలని, ఆదివాసి ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆదివాసి ఉపాధ్యాయ సంఘం స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఆత్రం భగవంతురావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆల్బర్ట్ చేతుల మీదుగా ఆదివాసి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు కొడప భుజంగారావు, మడప శ్రీనివాస్, పోర్తేటి సర్దార్ జీ పాల్గొన్నారు.



## సిఎంవి పిట్టల దొర మాటలు

### కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజల బొంద పెడతారు..

ప్రజాపక్షం/బైంసా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ పిట్టల దొరల వ్యవహరిస్తున్నారని మల్కాజిగిరి ఎం.పి.మాజీ మంత్రి బిజెపి నేత ఈటెల రాజేందర్,బిజెఎల్పీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.శుక్రవారం బైంసా లోని ఎస్.ఎస్.జిన్నింగ్ ఫ్యాక్టరీలో బిజెపి సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా గారడీ మాటలతో కాలం వెల్లడిస్తుందన్నారు.మైనారిటీ ఓట్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఎన్నకలకు వెళ్తుందే తప్ప చేసింది ఏమి లేదన్నారు.అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మౌనం, సహనం,ఓపిక ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తత్త్వమని అందుకే ముధోల్ నియోగకవర్గం లో 103 స్థానాలు గెలిచారంటే అది ఏక పక్ష తీర్పేనన్నారు.15 ఫైనాన్స్ నిధుల కోసమే రేవంత్‌రెడ్డి ఇష్టం లేకున్నా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లారన్నారు.20 రోజులు గడుస్తున్న సర్పంచ్ లకు చెక్ పవర్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని బిజెపి సర్పంచ్‌ల పట్ల వివక్ష చూపితే కర్రు కాల్చి వాత పెడతామని హెచ్చరించారు.బీజేఎల్పి ఉపనేత పాయల్ శంకర్, ఎంపి నగేష్,ఎమ్మెల్యే పవార్‌రామరావ్ పటేల్ జిల్లా అధ్యక్షుడు రితిష్ రాథోడ్ కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయి లో మండిపడ్డారు.

### సర్పంచ్ లకు సన్మానం..

కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లను,ఉప సర్పంచ్‌లను వార్ మెంబెర్‌లను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ శాలువాతో సత్కరించి మెమంటోలు ప్రధానం చేశారు.కార్యక్రమం ప్రారంభం కంటే ముందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.

### సన్మాన కార్యక్రమానికి భారీగా జనం..

సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి పెద్ద మొత్తంలో జనం రావడంతో సభ సక్సెస్ అయింది.వేలాది మందితో ఎస్.ఎస్.జిన్నింగ్ ఫ్యాక్టరీ నిండిపోయింది.కార్యక్రమం లో సీనియర్ నాయకులు,పార్టీ బాధ్యులు,కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాగిర్యాల్ పాఠశాలకు సైన్స్ మెటీరియల్ వితరణ

ప్రజాపక్షం/భీమ్‌గల్ : ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏనుగు దయానందరెడ్డి ద్వారా జాగిర్యాల్ ఉన్నత పాఠశాలకు సైన్స్ మెటీరియల్‌ను వితరణ చేశారు. గ్రామసర్పంచ్ గడల ప్రసాద్, వీడీసీ సభ్యులు శ్రీనివాస్, రమేష్, దామోదర్‌లు వార్డు సభ్యులు రాజేశ్వర్, గంగాధర్, సురేష్, సంజీవ్, విఘ్నేశ్వర్ ముఖ్యఅతిథిగా వచ్చిన లీలరాణికి సన్మానం చేసి రిబ్బన్ కట్ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి అందజేశారు. లక్ష రూపాయల విలువ చేసే రెండు ప్రయోట టై బెల్ట్‌తో పాటు సైన్స్ సామాగ్రిని దయానందరెడ్డి అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు కళావతి తెలిపారు. గతంలో పిల్లలు కూర్చోవడానికి వీలుగా డెస్క్ బెంచీలు పాఠశాలకు అందించారని తెలిపారు. పాఠశాలకు చేయూతనందిస్తున్న దయానందరెడ్డికి సర్పంచ్ గడల ప్రసాద్‌తో పాటు శ్రేయోభిలాషులు కళ్యాణ సుదర్శన్ వీడీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ : జిల్లా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున నిర్మలు ఉత్సవాల్లో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.నిర్మల్ జిల్లా చరిత్ర తెలియజెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు.ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించబోయే నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ ,ప్రజాప్రతినిధులను,ప్రముఖులను ఆహ్వానించాలని చెప్పారు. సం తకాల బోర్డు,సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలన్నారు.పర్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన సూచనలను పరిశీలించారు.ఉత్సవాలకు వచ్చే సందర్శకుల సంఖ్యను ముందుగా అంచనా వేస్తూ,అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు .అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సిపిఓ జీవరత్నం,డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి ,డిఎంహెచ్ఓ రాజేందర్, అగ్నిమాపక అధికారి శివాజీ ఉద్యానవన పంటల అధికారి రమణ,ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక శారీరక ధృఢత్వానికి దోహదం



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలో సీఎం కప్ క్రీడ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ స్థానిక బస్టాండ్ ప్రాంతంలో గల స్థానిక ప్రాథమిక పాఠశాల యందు మండలంలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులతో కలిసి క్రీడాజ్యోతి వెలిగించి,పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అక్కడ నుండి స్థానిక గర్ల్స్ హై స్కూల్ వరకు ర్యాలీ కొనసాగింది.అనంతరం అక్కడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసానికి,శరీరక ధృఢత్వానికి ఉపయోగపడతాయని,స్పోర్ట్స్ కోటాలో అనేక మంది ఉద్యోగులు సాధించి స్థిరపడ్డారని,గత కొన్ని రోజుల క్రితం రాష్ట్రానికి ఫుట్బాల్ ప్లేయర్ మెస్సిని తెలంగాణ రాష్ట్రానికి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని,క్రీడలలో అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవో రమాకాంత్,ఎమ్మార్వో సుజాత,ఎంఈఓ సంధ్యారాణి,ఎంపీఓ రత్నాకర్ రావు మస్కాపూర్ సర్పంచ్ లక్ష్మీ దయానంద్,సత్తెనపల్లి సర్పంచ్ సచిన్,దిలావర్పూర్ సర్పంచ్ మల్లేష్ జిల్లా అధికారులు వివిధ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ శివాలయానికి రానున్న మంగిరాములు మహారాజ్

ప్రజాపక్షం/నిజామాబాద్ : వేల్పూర్ శివాలయానికి మంగి రాములు మహారాజ్ రానున్నారని కార్యక్రమ అధికార ప్రతినిధి, ధార్మిక, ధర్మ ప్రచారకుడు కంకణాల రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వేల్పూర్ పట్టణ రెవెన్యూ శివారు ఆర్మూర్ వెళ్లే మార్గంలోని శివాలయానికి జనవరి 12 న స్వామి వివేకానంద జయంతి సోమవారం ఉదయం 11 గంటలకు రానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు గురుపూజ, అనంతరం అన్నప్రసాద వితరణ ఆరంభమవుతుందని మధ్యాహ్నం 1 గంటలకు శివాలయం ట్రస్ట్ చైర్మన్ కార్యాలయం ప్రారంభోత్సవం ఉంటుందని భగవద్గీత ప్రచారకర్తలకు సన్మానం కలదని భగవద్గీత ప్రశంసా పత్రాల పంపిణీ, మధ్యాహ్నం 2 గంటలకు శివాలయం పీఠాధిపతిగా అవధూత రామకృష్ణానంద్ ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని తెలిపారు.

## సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కోసం ఎంపిక చేసిన స్థల పరిశీలన

ప్రజాపక్షం/బోధన్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హంగులతో నూతనంగా నిర్మించదల్చిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులో బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉందని, త్వరలోనే పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు.



ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

## మాల సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు 11న సన్మానం



ప్రజాపక్షం/బోధన్: ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన మాల కులస్తులైన సర్పంచులు, ఉప సర్పంచులకు సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తెలంగాణ తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు రేఖాందాస్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక రాజకీయాల్లో మాల కులస్తులు తమకు వచ్చిన అవకాశాలని సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవలు అందిస్తూ, చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగానే వారిని ప్రోత్సాహం కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో 11వ తేదిన ఉదయం 11గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి గడ్డ వివేక్ వెంకట స్వామి, అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ రిక్క లింబాద్రి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ఎట్ల నాగరాజు లు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. డివిజన్ అధ్యక్షులు మిర్జాపురం సాయన్న, మాజీ సర్పంచి బంటు సాయిలు, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షుడు కారం స్వామి, పట్టణ సహాయ కార్యదర్శి సంజీవ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, రవీంద్రబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మర్రిపెల్లి భీమక్కపై అకస్మాత్తుగా పిచ్చి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, రోడ్డుపై వెళ్లాలంటేనే భయమేస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల నుంచి తమను రక్షించాలని కోరారు.

## కాల్వ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని కాల్వ గ్రామంలో శుక్రవారం రోజున ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరానికి డాక్టర్ బాలిక్ అహ్మద్,డాక్టర్ విజయ్ కుమార్ పశువులకు నటల నివారణ టీకాలు,గాలికుంటు వ్యాధులకు,పశు గర్భ కోశ నివారణ తదితర వ్యాధులకు టీకాలు,వైద్యం అందించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ బ్యాగరీ రోజ నవీన్ హాజరై మాట్లాడుతూ గ్రామంలోని పశువులు,గొర్లు మేకలు ఉన్నటువంటి రైతులు ఇలాంటి పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకుని వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు,వైద్యం చేయించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరికృష్ణ,కాంగ్రెస్ నాయకులు,సుధాకర్,పశువైద్య సిబ్బంది గోపాల్,ప్రభాకర్,భోజన్న ,పాడి రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయంతం చేయండి

ప్రజాపక్షం/బోథ్: జనవరి 18న ఖమ్మంలో జరుగుతున్న సి.పి.ఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను విజయంతం చేయాలని బోథ్ మండల కేంద్రంలో ని ఏఐటీయూసీ భవనంలో నాయకులు మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమం నుంచి నేటి వరకు కార్మికులు,రైతులు,పేదల హక్కుల కోసం సి.పి.ఐ పార్టీ పోరాటం చేసిందని,ఇంకా చేస్తూనే ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బోథ్ సి.పి.ఐ సీనియర్ నాయకులు గోవర్ధన్,బోథ్ మండల సిపిఐ అధ్యక్షుడు లింగంపెల్లి నరేష్,కార్తీక్,ప్రేమ్,మున్సిప్ లు పాల్గొన్నారు.

## వీడీసీ సభ్యులపై కేసు నమోదు

ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో కొందరు వ్యక్తులు గ్రామ అభివృద్ధి కమిటీ పేరిట కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షునిగా బిక్కు గంగాధర్,క్యాషియర్గా తులసీదాస్,రాయిటర్గా భీమరాజ్ గౌడ్,లను ఎన్నుకొని గ్రామంలో బెల్ట్ షాపు ఏర్పాటుకై వేలం నిర్వహించారని వేలం దక్కించుకున్న వ్యక్తిని దుర్కి పరమేశ్వర్ గౌడ్,ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. చట్టరీత్యా వీడిసిల ఏర్పాటు తగదని ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినట్లయితే శిక్ష తప్పదని తెలిపారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ

ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ : ఖానాపూర్ మండలం తర్లపాడ్,రంగపేట గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి పథకంలో మంజూరైన చీరలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.శుక్రవారం రంగపేట సర్పంచ్ పోలంపెల్లి సచిన్ ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లు కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు,వార్డ్ సభ్యులు,ఐకెపి సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయనిర్మలకు సన్మానం



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(టీ ఎస్టీవో) అనుబంధ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నేదురి విజయనిర్మల ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యక్షురాలు విజయనిర్మల ను ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు.యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయనిర్మల పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు లీలారాణి,జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి ,సభ్యులు సుకన్య,గంగరాజు సాధన,మంగ పాల్గొన్నారు.

# క్రీడారంగంలో నిజామాబాద్ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** క్రీడా రంగంలో జిల్లా ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎంకప్ 2026 సెకండ్ ఎడిషన్ క్రీడా పోటీలను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. పాలిటెక్నిక్ మైదానం నుండి ప్రారంభమైన టార్చ్ రిలే ర్యాలీ, ప్రధాన మార్గాల మీదుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి నిఖత్ జరీన్, యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య, హుసాముద్దీన్ వంటి అనేక మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తుండటం ఎంతో గొప్పవిషయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. క్రీడల్లో ధనిక, పేద అనే తారతమ్యం ఉండదని, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రతిభను కొలమానమని క్రీడాకారులకు మార్గనిర్దేశంచేశారు. అతి సామాన్య కుటుంబం నుండి వచ్చిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్ జీవితమే ఇందుకు చక్కటి నిదర్శనమని కలెక్టర్ ఉదహరించారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే బంగారు భవిష్యత్తు స్వంతమవుతుందన్నారు. సిఎం కప్ క్రీడా పోటీలలో అన్ని అంశాలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శననిచ్చి నిజామాబాద్ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా స్విమ్మింగ్ క్రీడాకారిని అని, ఫ్రీ స్టైల్, రిలే, బట్టర్‌ఫ్లై తదితర విభాగాలలో అనేక పోటీలలో పాల్గొన్నానని కలెక్టర్ క్రీడల పట్ల తనకు గల ఆసక్తిపై తెలిపారు. చక్కటి దేహదారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని గుర్తు చేశారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెదడు చురుకుగా మారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపగలుగుతారని, అన్ని రంగాలలో చక్కగా పని చేయవచ్చని సూచించారు. క్రీడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో తోడ్పాటునందిస్తామన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, దురాలవాట్ల బారిన పడకుండా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఇందుకు క్రీడలను వేదికగా మలుచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్‌కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, సిఎస్ఐ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ రాజేశ్వర్, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎటిఎంల చోరీలకు తెగబడ్డ అంతర రాష్ట్ర ముఠా అరెస్ట్

## వెల్లడి చేసిన సిపి సాయిచైతన్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ఎటిఎంలను కొల్లగొట్టే అంతర రాష్ట్ర దొంగల ముఠాను శుక్రవారం 1వ టౌన్ పోలీసులు ఉదయం 9 గంటలకు నిఖిల్‌సాయి ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చూస్తుండగా బోలెరో వాహనంలో ఎపి 16, 17 లో కర్రలు, రాళ్లు పెట్టుకుని వస్తున్న బోలెరో వ్యాన్‌ని ఆపి చెక్ చేసి విచారించగా వీరంతా హర్యానాకు చెందిన అబ్దుల్లా గ్యాంగ్ మనుషులుగా ఆసిఫ్ అర్షద్, అజ్బీర్లుగా గుర్తించామని సీపీ సాయిచైతన్య తెలిపారు. హర్యానాకు సంబంధించిన మేవా తాలూకా ఎక్కువగా ఎటిఎంలను కొల్లగొట్టే ముఠా ప్రధాన నిందితుడు హర్యానా రాష్ట్రం పునఃతాలుకా బాదిల్ గ్రామానికి సంబంధించిన లారీ డ్రైవర్ వృత్తి కొనసాగిస్తున్న మహ్మద్ అమీర్ అన్సారి బేగంపేట హైదరాబాద్ ప్రశాంత్‌నగర్‌లో జీవిస్తున్న వ్యక్తి సహజంగా మహారాష్ట్ర, ముంబాయి వెస్ట్ అందెరి నివాసి, హైదరాబాద్ ప్రశాంత్ నగర్‌లో జీవిస్తున్న ఈ వ్యక్తి సహజంగా మహారాష్ట్ర, ముంబాయి వెస్ట్ అందెరి నివాసి వాజిద్‌ఖాన్ హర్యానా రాష్ట్రం బాదం గ్రామానికి సంబంధించిన హర్యానా మేవాత్ తాలుకా గజర్‌పూర్‌కు సంబంధించిన మహ్మద్ అజీజ్, హర్యానా రాష్ట్రం పల్వాల్ జిల్లాకు చెందిన షాముద్దీన్ వ్యక్తులు మూటగా చేరి 2018 లో అజ్మీర్, ఉదయపూర్ వంటి చోట్ల ఎటిఎంలను కొల్లగొట్టామని, కొల్లగొట్టిన కేసులో వీరంతా జైలుకు వెళ్లమన్నారు. అదేవిధంగా మహ్మద్ అమీర్ అన్సారి హైదరాబాద్ నివాసి వాస్తవానికి ఈ అబ్బాయి మహారాష్ట్ర వెస్ ముంబాయి అందెరిలో ఉండేవాడు కానీ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక మైనర్ అమ్మాయిని ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకుని హైదరాబాద్ ఇంటికి తెచ్చుకున్నామని, దీంతో ఇతనిపై పోక్సో కేసు పెట్టగా శివపురం పోలీస్‌స్టేషన్ జైలుకు పంపామని ఈ నేపథ్యంలో అబ్దుల్లాతో పరిచయం పెంచుకుని తెలంగాణలో ఎటిఎంలు కొల్లగొట్టే పథకాన్ని పన్ని ఎటిఎంలను కొల్లగొట్టడానికి కావల్సిన ఆక్సిజన్ సిలిండర్, చిన్న ఎల్‌పిజీ సిలిండర్ గ్యాస్, కట్టర్, గ్లౌజులు, నల్లటి రంగు స్ప్రే బాటిల్‌ను జూలై 8న షాపూర్‌నగర్ మార్కండేయ నగర్ రోడ్డులో కొనుక్కుని అక్కడ హెచ్‌డిఎఫ్‌సి ఎటిఎంను కొల్లగొట్టడం జరిగిందని దీని నుండి 30 లక్షల వరకు దొంగలించి జీడిమెట్ల బస్సు డిపో వద్ద మోరిలో గ్యాస్ కట్టర్ తదితరెటిఎంలు కొల్లగొట్టే సామాగ్రిని పడవేసి రెండు మోటారు సైకిల్ దొంగలించుకుని కామారెడ్డికి వచ్చి అక్కడ బైక్‌లను వదిలేసి ఆదిలాబాద్ గుండా హర్యానాకు పారిపోవటం జరిగిందని తర్వాత అమీర్ అర్షద్‌లను అరెస్ట్ చేసి జైలుకు పంపగా అబ్దుల్లా దొరకలేదన్నారు. తర్వాత బెయిల్‌పై విడుదలై అబ్దుల్లా మరలా అమీర్‌తో కలిసి అబ్దుల్లా అమీర్, వాజిద్, విక్రమ్‌లు కొత్తగా ఏర్పడి ఫత్తేనగర్ మార్కెట్‌కు వెళ్లి ఏటింలను కొల్లగొట్టే వస్తువులను కొనుగోలు చేసి హైదరాబాద్ నుండి జహీరాబాద్‌కు వస్తూ మార్గమధ్యలో టోల్‌ప్లాజా వద్ద ఎటిఎం కనడగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో పోలీసు వారు అటుగా రావటానికి గమనించి పారిపోయారు. అదే విధంగా జహీరాబాద్‌లో ఒక బోలెరో వాడిని దొంగలించి అందులో గ్యాస్ కట్టర్ సామాగ్రి వేసుకుని 44వ నెంబర్ జాతీయ రహదారి డిచ్‌పల్లి వరకు చేరుకుని డిసెంబర్ 31న రాత్రి బోలెరోలో నిజామాబాద్ పట్టణంలోకి వచ్చి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎటిఎం కనబడగా సుమారు 2 గంటలకు ఎటిఎంలో కొల్లగొట్టే ఏర్పాట్లు చేస్తూ ఉండగా ఎటిఎం సైరన్ మోగిన శబ్దానికి ఆకాంక్ష పారిపోయి దొంగలించిన బోలెరో వాహనాన్ని ఇందల్వాయి వద్ద చెట్ల పొదల్లో దాచి ఎపి 20 ఎపి 1617, హెచ్ఆర్72కె8670 చిన్న ఆక్సిజన్ సిలిండర్ చిన్న ఎల్‌పిజి సిలిండర్ ఎరుపు, బ్లూ కలర్ పైపులతో గ్యాస్ కట్టర్ 2 సర్జికల్ గ్లౌజులు స్ప్రే బాటిల్ ఇనుపరాడు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై అండర్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 1వ టౌన్ పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, 1వ టౌన్ సీఐ రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.




# సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పిన ఆల్ఫోర్స్ ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** సంక్రాంతి పండుగ పండుగ సందర్భంగా అల్ఫోర్స్ లో సంస్కృతి, సాంప్రదాయం ఉట్టి పడేలా పల్లె వాతావరణాన్ని, పల్లె వైభవాన్ని చాటి చెప్పేలా ఘనంగా నిర్వహించారు. ప్రారంభానికి ముందు ప్రాంగణాలలో ఏర్పాటు చేసిన శ్రీ గోదారంగనాథ స్వామి చిత్రపటానికి పూజా నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ప్రారంభించారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి పండుగని, పండుగ ద్వారా సమాజంలో సుభిక్షం నెలకొంటుందని తద్వారా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవిస్తారని అన్నారు. సంక్రాంతి వైభవాన్ని చాటి చెప్పే విధంగా ప్రతి సంవత్సరం లాగే విద్యార్థులకు సాంస్కృతిక వైభవాన్ని తెలియజేయవలసిన అవసరం ఎంతగానో ఉందని మరియు వాటిని సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులు సైతం ప్రేరేపించాలని సూచించారు. సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు చాలా గొప్పగా తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల్లో సైతం నిర్వహించుకోవడం చాలా గొప్ప విషయమని మరియు దేశ విదేశాల్లో సైతం ఈ పండుగ వైభవాన్ని చాలా ఘనంగా జరుపుకుంటారని అన్నారు. పండుగను చాలా విశిష్టంగా పరిగణిస్తారని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అదే విధంగా ప్రాంగణాన్ని అందంగా పల్లె వాతావరణం తలపించే విధంగా అలంకరించి ఆలోచింపజేశారు. సంక్రాంతి పండుగకు సూచికలైన భోగి, నోములు, భోగి పళ్ళు, మంగళ గౌరీవ్రతం తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టి పండుగ విశిష్టతను అద్భుతంగా వర్ణించారు. వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణవేణి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాపక్షం/చొప్పదండిః** చొప్పదండి పట్టణంలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి, బోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మలు అని, మనలో ఐక్యతకు నాంది అన్నారు. సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరికి గొప్పనైన పండుగ అన్నారు. మహిళలు, రైతులకు ఈ పండుగ చాలా విశిష్టమైన పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాంబరాజు, ఇంచార్జి మేడి శాంభయ్య, విధ్యార్థుల తల్లిదండ్రులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

**చొప్పదండిః** చొప్పదండి పట్టణంలోని గీతా విద్యాలయం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, గోదాదేవి, సోదమ్మల వేషధారణ గావించడమే కాకుండా భోగిమంటలు, గొబ్బెమ్మలు, ముగ్గులు వేయించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లింగారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతిలో ముఖ్యమైన భాగం అని, ప్రతి విద్యార్థి మన సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సంబరాలు నిర్వహించామని చెప్పారు. పాఠశాల చైర్మన్ ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు, విధ్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# డిమాండ్లను పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన

**ప్రజాపక్షం/ఎడపల్లిః** ఫిబ్రవరి 5వ తేదిన దేశ రాజధాని డిల్లీలో జరగనున్న మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమానికి పిలుపునిస్తూ శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. విధుల్లో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎస్టియు ఎడపల్లి మండల అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్ డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సీనియర్ ఉపాధ్యాయులకు, సర్వీసుల్లో ఉన్న వారికి టెట్ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. గందరగోళంగా ఉన్న సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి, ఉపాధ్యాయుల భవిష్యత్తుకు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.

# ఎంపి, ఎమ్మెల్యేలను కలిసిన నీలా పంచాయతీ పాలకవర్గం



**ప్రజాపక్షం/ఎడపల్లిః** రెంజల్ మండలంలోని నీలా గ్రామ పంచాయతీ అభివృద్ధి కో సం సర్పంచి క్యాతం యోగేష్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు శుక్రవారం పలువురు ముఖ్యమైన ప్రజాప్రతినిధులను కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ను, అలాగే బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. అనంతరం గ్రామ సమస్యలపై వారితో చర్చించారు. నీలా గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలని వారు కోరారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే లు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

# ఎడపల్లి పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఓ

**ప్రజాపక్షం/ఎడపల్లిం:** ఎడపల్లి పిహెచ్‌సిని జిల్లా వైద్యాధికారిని డా.రాజశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపి, ల్యాబ్, మెటర్నిటి వార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించి సిబ్బంది అంకిత భావాన్ని కొనియాడారు. పిహెచ్‌సిలో ఆరోగ్య సేవలు బాగున్నాయని, సీజనల్ వ్యాధులతో పాటు ధీర్ఘకాలిక వ్యాధుల పై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నారని ఆమె అన్నారు. పిహెచ్‌సి డాక్టర్ లతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని ప్రజలు వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డా.వినీత్ రెడ్డి, ఆయుష్ డా.వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యభిచార గృహాలపై మెరుపు దాడి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సీసీఎస్ పోలీసులు నిజామాబాద్ రూరల్ పిఎస్, 6వ టౌన్ పిఎస్ పరిధిలో వ్యభిచారం చేస్తున్నారన్న సమాచారం మేరకు సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు దాడులు నిర్వహించగావారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సిసిఎస్ ఇన్‌చార్జి ఎసిపి మస్తాన్‌అలీ నేతృత్వంలో రెండు టీమ్‌లు మెరుపు దాడి నిర్వహించి విటులను, వ్యభిచారం చేస్తున్న వారిని పట్టుకుని వీరి నుండి మొబైల్ ఫోన్లను 8 విటుడులు, 4 విటురాళ్లు రూ.27290 లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

